డ్వాక్రా మహిళల జీవన ఉపాధిపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర - యస్.రాయవరం : గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవన ఉపాధి పై అవగాహన కల్పించాలని ఎలమంచిలి వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి అన్నారు. ఎస్ రాయవరం మండలం మహిళా సమైక్య కార్యాలయంలో నాలుగు రోజులుగా మండలంలో గల వెలుగు సిబ్బంది, యానిమేటర్లు లకు జీవన ఉపాధి పై శిక్షణ తరగతులు జరుపుతున్నారు. అందులో భాగంగా ఏరియా కోఆర్డినేటర్ ఈ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ.... జీవన ఉపాధి వార్షిక రుణం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు .డ్వాక్రా మహిళలకు ఇచ్చే రుణాలను సద్వినియోగం ఆర్థిక అభివృద్ధి పై సర్వే చేసి వారికి తెలియజేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు వరప్రసాద్, కుమారస్వామి ,ఏపిఎం వరప్రసాద్, సీసీలు సుబ్బారావు, గోవిందు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరమైన విద్యుత్ వైర్లని మార్చాలి : సీపీఐ

విశాలాంధ్ర - చోడవరం : భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద సోమ వారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ స్థానిక సమస్యలు సర్వే లో భాగంగా చోడవరం ఐ.టి.ఐ. కాలనీలో ఇళ్లపై నుండి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉనట్లు గుర్తించి వాటిని మార్చవలసిందిగా అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారుల తీరు అనుమానాస్పదంగా ఉందని తెలిపారు. ప్రజాసంఘాల వినతులను తూతూ మంత్రంగా పరిశీలించి, నిర్వాసితుల్ని ఎస్టిమేషన్ చార్జీలు పెట్టుకోవాలని లేని పక్షంలో మేము ఏమి చేయలేము అని, అప్పుడే విద్యుత్ వైర్లు మారుస్తామని ఎలక్ట్రికల్ ఏ.ఈ. చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పారిశుధ్య పనులు చేసుకుంటూ చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతూ నివాసం ఉంటున్న వారి ఇంటిపైన కరెంటు వైర్లు వెళ్తున్నాయని తెలియజేస్తే, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మేము ఏమీ చేయలేమని విద్యుత్ అధికారులు చెప్ప డాన్ని భారత్ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తుననట్లు తెలిపారు. నివాసిత ప్రాంతాల్లో వేలాడే విద్యుత్ వైర్లతో ప్రమాదం జరిగితే దానికి విద్యుత్ అధికారులే బాధ్యులని తెలియజేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు జలగడుగులు అప్పలరాజు, పొట్నూరు అరుణ, గణేష్ శివ, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు న్యాయం చేయాలని వినతి

విశాలాంధ్ర - పరవాడ : పరవాడ మండలం తానాంలోని నిరుపేద రజక కుటుంబాలు గత పదిహేనేళ్ళుగా ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ కుటుంబాలపై వేధింపులకు పాల్పడుతున్నారని జడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఆరోపించారు. సోమ వారం తమకు న్యాయం చేయాలని రజకులు అనకాపల్లి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేధకలో అర్జీ పెట్టుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పిఎస్‌రాజు పత్రికా ప్రకటన విడుదల చేసారు. గ్రామానికి చెందిన పలు రజక కుటుంబాలు ఏ విధమైన ఆసరా లేకుండా కుల వృత్తి, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వ స్థలంలో చిన్న పాటి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న ఈ నిరుపేదలపై కొందరు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పదిహేనేళ్ళుగా నివాసం ఉంటున్న పేదలను అక్కడ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయని చెప్పారు. గ్రామంలోని ఇతర గెడ్డలను, వాగులను, చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నాయకులు, అనుచరుల అక్రమాలను పట్టించు కోని రెవెన్యూ అధికారులు నిరుపేద రజక కుటుంబాలపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు. ఈ వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తక్షణమే వారికి నివాస స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. నివాస స్థలాలు మంజూరు చేసే వరకు వారిని అక్కడ నుంచి తరలించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. గతంలో తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని, దీంతో సోమవారం అనకాపల్లి కలక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీ పెట్టుకున్నారని తెలిపారు.

గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని పరవాడ పాలెం గ్రామం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బాగంగా నూతన పనులు ప్రారంభించారు. వ్యవసాయానికి అనుకూలంగా ఈ పథకం గ్రామాల్లోఎంతో అభివృద్ధి పథంగా ముందుకు సాగేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి వర్యులు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, పీలా గోవింద్ సత్య నారాయణ, ఎంపీ, సీఎం రమేశ్ ,నేతృత్వం లో అనకాపల్లి నియోజక వర్గంలో ప్రతీ గ్రామం లో ఉపాధి హామీ పథకం పనులు భూమి పూజ చేయడం జరిగింది. అందులో భాగంగా పరవాడ పాలెం గ్రామం లో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణ మూర్తి , సర్పంచ్ బలిజి ముసిలి నాయుడు మంగ, ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వర రావు, వార్డు మెంబర్లు పరవాడ చిన రమణ, కలగా శివ, గొంతిని శివాజీ, ఎదిరి నాయుడు, యలమంచిలి వీరు నాయుడు, టీడీపీ అధ్యక్షులు, సేనాపతి కృష్ణ, జనసేన ఉప అద్యక్షులు కడిమి శ్రీను, బీజేపీ అధ్యక్షులు బలిజి సాంబ శివ, కూటమి నాయకులు సరిపిరెడ్డి దాసు , గొంతిని లోవ అప్పారావు, గొంతిని గంగాధర్, కర్రి రాజు సలాధి సతీష్, ఉపాధి హామీ పథకం మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి 4కేజీల వెండి కిరీటం అందజేత

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల అర్బన్ కాలనీలో గల శ్రీ అభయాంజనేయ స్వామి వారికి సోమవారం భక్తులు 4కేజీల వెండి కిరీటంను అందించారు. గ్రామానికి చెందిన గర్భాపు లోవరాజు, చిప్పాడ లక్ష్మణరావు, రెడ్డి నారాయణరావుతో పాటు కాలనీ వాసులు 4 కేజీల వెండితో కిరీటాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి అలంకరించారు.

సకాలంలో అర్జీలను పరిష్కరించాలి : జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్ : ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు హాజరుకావాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదే శించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులు మాత్రమే హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందికి పంపించకూడదని ఆదేశించారు. అదేవిధంగా డివిజను, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్దులైన అర్జీదారుల నుండి పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి పిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వృద్దుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

బ్లాస్టింగ్‌లతో భయాందోళనలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : పోలవరం కాలువ తవ్వకాల పేరుతో చేస్తున్న బ్లాస్టింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణంలోని దుర్గానగర్, దుర్గాకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపిటిసి కశింకోట సత్యనారాయణ, వార్డు సభ్యులు పల్లా ప్రసాద్, తుమ్మలపల్లి సతీష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు గంపల చినరాజు మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా తాము నివాసం ఉంటున్న ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న కొండను బాంబులతో బ్లాస్టింగ్ చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి సమాచారం లేకుండా చేస్తున్న బ్లాస్టింగ్‌ల కారణంగా తాము తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని తెలిపారు. వరుస బ్లాస్టింగ్‌ల కారణంగా భూకంపం వచ్చినట్లుగా ఉంటుందని తెలిపారు. పోలవరం కాలువ నిర్మాణానికి తాము అడ్డం కాదని, అయితే బ్లాస్టింగ్ సామర్థ్యం తగ్గించాలని, బ్లాస్టింగ్ జరిగే సమయంలో సమాచారం ఇవ్వాలని, బ్లాస్టింగ్ కి బ్లాస్టింగ్‌కి మధ్య కొంత సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున బ్లాస్టింగ్‌లు చేయడం వలన తమ ఇళ్ల బీటలు వారుతున్నాయని వాపోయారు. ఈవిషయమై తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మాణం కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. బ్లాస్టింగ్ సామర్థ్యం తగ్గించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మదర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో సోమవారం మదర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వి.సత్యగంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన చలి వేంద్రాన్ని మేజర్ పంచాయతీ సర్పంచ్ దొడ్డం ప్రసాదరావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాదరావు మాట్లాడుతూ మదర్ మదర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందినీయమని అన్నారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు సుమారు 1500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా టిడిపి తెలుగు యువత సెక్రెటరి రోమాల చంద్రశేఖర్ 5 వేలు రూపాయలు విరాళంగా అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా సత్యనారాయణ , ధనమిరెడ్డి శ్రీనివాసరావు, మామిడి శంకర్రావు ,గొంప అశోక్ కుమార్, బర్ల రమణ, ట్రస్ట్ సభ్యులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో పెద ఉప్పలం చిన్న ఉప్పలం రెవిన్యూ పరిధిలో ఆక్రములకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ .రాయవరం వైస్ .ఎంపీపీ చోడివల్లి అప్పలరాజు జిల్లా కలెక్టర్ కు పి జిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ రెవెన్యూ గ్రామాల్లో రికార్డులను ప్రభుత్వ భూమిని ఉన్న వాటిని స్వాధీనం చేసుకోలేదని గతంలో ఫిర్యాదు చేసిన స్థానిక అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోకపోవడంపై ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వీటిపై విచారణ చేసి ప్రభుత్వం సంబంధించిన విలువైన భూములను ఆక్రమణ చేసిన వాటిని రక్షించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - కె కోటపాడు : మండలంలోని మూడు అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ పిఓ మంగతాయారు తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం మండలంలో పోతన వలస, కే సంతపాలెం శివారు కేకే అగ్రహారం, కింతాడ శివారు రామ చంద్రపురం అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి కోసం ఈనెల 17 లోపు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకో వాలన్నారు. కేకే అగ్రహారం పోస్ట్ ను ఓసికి రిజర్వ్ చేయగా మిగిలిన రెండు కేంద్రాలకు బీసీ అభ్యర్థులకు కేటాయించారు. మహిళా అభ్యర్థులు 21 నుండి 35 సంవత్సరాల లోపు ఉండి పదవ తరగతి పాస్ అవ్వాల న్నారు. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, వితంతువు అయివుంటే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వితంతువుకు మైనర్ పిల్లలు ఉన్నట్లయితే వారి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలన్నారు. కే.కోటపాడు ఐసిడిఎస్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని పిఓ తెలిపారు.

నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - వి.మాడుగుల : డిఆర్‌డిఎ, సీడాప్, కౌశల్ యోజన ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసు కోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ద్వారా యువతీ యువకులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని తప్పనిసరిగా నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని చెప్పారు. ఈ జాబ్ మేళాలలో 80 మంది యువతీయువకులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాళపురెడ్డి వెంకట రాజారామ్, టీడీపీ మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జాబ్ డిస్ట్రిక్ మేనేజర్ కళ్యాణి, డీజీఎం మహంతి పాల్గొన్నారు.

ఆదాని స్మార్ట్ మీటర్లు ఇన్స్టాలర్స్‌కు 28,000 ఇవ్వాల్సిందే : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - అనకాపల్లి : అదాని స్మార్ట్ మీటర్లు ఇన్స్టాలర్స్‌కు 28,000 జీతం 12800 తగ్గించడానికి నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ. ఆదాని స్మార్ట్ మీటర్స్ ఇన్స్టాలర్స్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఏ సంస్థలో అయినా సరే పని చేసే ఉద్యోగులకు జీతాలు పెరుగు తాయి తప్ప సగానికి సగం జీతాలు తగ్గే పరిస్థితి ఎక్కడ చూడలేదని దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగములోనికి తీసుకునే సమయంలో 28 వేల శాలరీ అసిస్టెంట్ ని ఇస్తామని చెప్పి ఇప్పుడు అసిస్టెంట్ ఇవ్వలేమని, 12,800 మాత్రమే జీతం ఇస్తామని చెప్పడం అదాని స్మార్ట్ మీటర్స్ కాంట్రాక్టర్లకు పద్ధతి కాదని దొరబాబు హెచ్చరించారు.న్యాయం చేయాలని కాంట్రాక్టర్ ప్రతినిధులను ఇన్స్టాలర్స్ అడిగితే ఉద్యోగం తీసేస్తామని బెదిరింపులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్తిబాబు, లక్ష్మీనారాయణ, లాలం బాబురావు, నాగార్జున, రాజేష్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అడ్డగోలు అక్రమాలు..కబ్జాలు, దురాక్రమణలకు కేరాఫ్ చోడవరం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర - చోడవరం : భూ కబ్జాలు, దురాక్రమణలకు కేరాఫ్ అనకాపల్లి జిల్లా చోడవరమని, అర్ధరాత్రి అడ్డగోలు అక్రమాలు జరుగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపి స్తున్నారు. ఈ మేరకు కార్మిక నాయకుడు రెడ్డిపల్లి మాట్లాడుతూ చోడవరం మేజర్ పంచాయతీ పాత బస్టాండ్ దరి చీడికాడ రోడ్డులో గ్రామ కంఠంలో కబ్జాలకు పాల్పడిన వ్యాపారులు అర్ధరాత్రి బిల్డింగులు నిర్మిస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, పంచాయితీ, రెవెన్యూ, పోలీస్ అధికారుల అండదండలతో కూటమి కబ్జాగాళ్లు రెచ్చిపోతున్నారని తెలిపారు. ఇప్పుడు ఉన్న 30 షాపులకు పంచాయతీ కు 60 లక్షల రూపాయలు గ్రౌండ్ టాక్స్ కట్టవలసి ఉండగా, పంచాయతీ అధికారులు చేతివాటం ప్రదర్శించి 60 లక్షల రూపాయల గ్రౌండ్ టాక్స్ ను మాఫీ చేసి, ఆ షాపులకు ఇంటి పన్నులను, బిల్డింగ్ అప్రూవల్ ప్లాన్ అక్రమంగా మంజూరు చేసారని తెలిపారు. దీనివలన చోడవరం పంచాయతీకి ఆదాయం పూర్తిగా నష్టపోయి పంచాయతీ అభివృద్ధికి నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. పంచాయతీ అధికారులు, తెలియజేసిన షాప్ యజమానులతో కుమ్మక్కై సెలవు దినాల్లో పర్మిషన్ మంజూరు చేసి అర్ధరాత్రి 11 దాటిన తర్వాత స్లాబ్ నిర్మాణం చెయ్యడానికి అక్రమంగా ఎలా అనుమతిస్తున్నారు అని ప్రశ్నించారు దీనిపై తక్షణమే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

ఉపాధి హామి బకాయిలు చెల్లించండి : పవన్ కళ్యాణ్‌కు చేతులు జోడించి వినూత్న రీతిలో కూలీలు నిరసన

విశాలాంధ్ర - కె కోటపాడు : మండలం లోని సింగన్న దొరపాలెం కె.కోటపాడు గ్రామాలకు చేందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం పని ప్రదేశాల్లో చేతులు జోడించి పెండింగ్ లో ఉన్న ఉపాధి హమి బిల్లులను చేల్లించాలని వినూత్న రీతిలో నిరసన తెలిపారు విరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న సిఐటియు మండల కార్యదర్శి ఇల్లే నాయుడుబాబుమాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 54 కోట్లు ఉపాధి హామీ భకాయిలు తక్షణమే చేల్లించాలని డిమాండ్ చేసారు,10 వారాలు నుండి బకాయిలు చేల్లింపులు చేయకపోతే కూలీలు ఎలా బ్రతకాలి అంటూ ప్రశ్నించారు. ఈ సంవత్సరం కొత్త పనులుకు 7 రూపాయలు పెంచి ఉపాధి కూలీలు పండగ చేసుకోమంటు ప్రభుత్వ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు,. మండు టెండలో పని చేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గతంలో తట్టా గునపాం , పార మంచి నీళ్ళు. సమ్మర్ ఎలవెన్సులు ఇచ్చే వారని అవి పూర్తిగా కట్ చేసి 7 రూపాయలు పెంచి నట్లు ప్రకటించడం అన్యాయమన్నారు. ఉపాధి హమి శాఖకు పవన్ కల్యాణ్ వంటి వ్యక్తులు మంత్రులు గా ఉండి కూలీలు కష్టాన్ని అర్దం చేసుకోక పోవడం విచార కరమ న్నారు,ఉపాధి హామీ కి లక్ష కోట్లు ఉన్న బడ్జెట్ ను నరేంద్ర మోడీ ప్రభుత్వం దశలవారీగా 62 వేలు కోట్లు కు తగ్గించుకుంటూ వచ్చిందన్నారు. నిత్యవసర ధరలు వీపరీతంగా పెరిగి పోవడం కూలీలకు ఇచ్చే 307 రూపాయలు ఏమూలకు సరిపోదన్నారు,తొమ్మిది వారాలు నుండి బకాయిలు నేటికీ చేల్లించక పోవడం కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు మేటిరియల్ చార్జీలు వీపరీతంగా పెంచెసి కూలీలు పోట్ట కొడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. కూలీలు పనులు చేస్తే కేంద్రం నుండి వచ్చే మేటిరియల్ చార్జిలతో సి సి రోడ్లు పంచాయతీ భవనాలు స్కూల్ ప్రహరీ గోడలు పసువులు సెడ్డులు వంటి అనేక అబివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో మొదటి స్థానంలో అనకాపల్లి జిల్లా ఉందని జిల్లా కలెక్టర్ గారే స్వాయాన ప్రకటీంచారని అలాంటప్పుడు పనిచేసిన కూలీలకు కూడా బిల్లులు చేల్లింపులో మొదటి స్థానంలో ఉండాలి కాదా!అని ప్రశ్నించారు . పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పర్యటన సందర్భంగా వినూత్న రీతిలో కూలీలు నిరసన చేసారు. ఈ కార్యక్రమంలో అదికసంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి : సీపీఎం

విశాలాంధ్ర - రాంబిల్లి : మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో, లాలం కోడూరు, ఎరకన్న ఇల్లు, చాటమెట్ట, సీతపాలెం, రామచంద్రపురం, పెదయాత్రపాలెం,తోట వీధి వంటి గ్రామాలు ఆ పార్టీ బృందం సోమవారం పర్యటించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మాట్లాడుతూ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల సెజ్ ఫార్మా కంపెనీల నుండి విడుదల వుతున్నటువంటి విషవాయువుల వలన, వ్యర్థ రసాయనాలు కలిసిన నీటి వలన ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని ఆరోపించారు. కంపెనీలు స్థాపించినప్పుడు, ఎటువంటి కాలుష్యం ఉండదని, ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎంతో గొప్ప మాటలు చెప్పిన అధికారులు,పాలకులు మాటలు నేడు ఆచరణలో చూస్తే కాలుష్యం బారిన పడి ప్రజలు గుండె జబ్బులు, కిడ్నీ, లివర్, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ పంట పొలాలు ద్వారా ఫార్మా కంపెనీలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయన జలాలు ప్రవహిస్తూ సముద్రంలో చేరడం వలన, ఇటు రైతులతోపాటు, అటు మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని మండిపడ్డారు. ఈ కాలుష్య వ్యర్థ జలాలు తాగినటువంటి పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఆర్థికంగా నష్టపోయిన రైతులు కుటుంబాలను పోషించుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పొల్యూషన్ అధికారులు గానీ, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకుని పొల్యూషన్ అరికట్టే విధంగా కంపెనీలపై చర్యలు చేపట్టాలని, లేనియెడల ప్రజలందరినీ సమీకరించి, ఫార్మా కంపెనీల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తో పాటు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ



విశాలాంధ్ర - గొలుగొండ : దేశ రక్షణే ధ్యేయంగా స్థాపితమై ప్రజా సంక్షేమం దేశ నిర్మాణ కోసం అంకితమై కోట్లాదిమంది కార్యకర్తల సంఘీభావంతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని మండల పార్టీ అధ్యక్షుడు చందక గౌరీ నాయుడు అన్నారు. సోమవారం గొలుగొండ మండలం ఏ ఎల్ పురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఆవిష్కరించారు. అలాగే ప్రజలు దాహార్తి తీర్చేందుకు మజ్జిగతో చలివేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చందక గౌరీ నాయుడు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు దీన్ దయాల్ ఉపాధ్యాయ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ప్రవేశపెట్టిన భారతీయ జనతా పార్టీ మొదటిసారిగా జన సంఘ్ పేరుతో ఆవిర్భవించి అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ భారతీయ జనతా పార్టీగా ఎదిగి భారతదేశాన్ని శాసించే విధంగా దేశంలో నే అతిపెద్ద పార్టీగా అవతరించింద న్నారు. ఈ కార్యక్రమంలో, మండల ప్రధాన కార్యదర్శులు యం. రామదాసు, నెల్లూరి సాంబశివ, మాజీ ప్రధాన కార్యదర్శి రమణ యాదవ్, మండల ఉపాధ్యక్షులు ఎక్కల నాగేశ్వరరావు అంకంరెడ్డి దుర్గాప్రసాద్, కోశాధికారి కొల్లి దుర్గాప్రసాద్, అల్లూరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావు బిజెపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పడమటమ్మ తల్లికి చెందిన 110 ఎకరాల భూమిని కాపాడండి

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్. భీమవరం పంచాయితీ రెవిన్యూ పరిధిలో సర్వే నెం. 173/ 3 -19 లో గల చిన భీమవరం గ్రామానికి చెందిన మల్లాం గ్రామ సరిహద్దులు వరకు గల పడమటమ్మ తల్లి కి చెందిన 110 ఎకరాలు డి - ఫారం భూమిని ధన బలం, రాజకీయ పలుకుబడి, అండదండలు తో భూ బకాసురులు ఇష్టరాజ్యంగా కబ్జా చేసి ఆక్రమించుకుంటున్నారు. గత 30 సంవత్సరాల కు పైగా పడమటమ్మ తల్లి భూములను ఆక్ర మించుకొని ఇది అన్యాయం అని అడిగిన గ్రామస్తులను అనకాపల్లి కి చెందిన బొడ్డెడ సన్యాసి రావు, స్థానిక వెలంకాయల అప్పలనాయుడు, వెలంకాయల గోవింద్ నాయుడు వారి కుటుంబ సభ్యుల గ్రామస్తులు పై అక్రమ కేసులు బణా యించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు అంతా ముక్త కంఠం తో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆదివారం స్థానిక గ్రామస్తులు అంతా ఏకతాటి పై గ్రామం లో స్థానిక పడమటమ్మ తల్లి ఆలయ ప్రాంగణం లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ 1982 లో పాత సర్వే నెం. 221 లో ఎటువంటి పట్టాలు లేకుండా ఖాళీ ఉన్న ఈ భూమి అనకాపల్లి కి చెందిన బొడ్డెడ సన్యాసి రావు (షావు కారు) అనే వ్యక్తి గ్రామం అభివృద్ధి కోసం మా తాత, తండ్రులు ఫలసాయం అనుభవించి ఆలయాన్ని అభివృద్ధి పరచడానికి అగ్రిమెంట్ మీద రాసి ఇచ్చిన ఈ 110 ఎకరాలు భూములు ను కాలక్రమంలో ఈ వ్యక్తులు లే రాజకీయ పలుకుబడి తో అధికారులు ను లోపరుచుకొని వందల ఎకరాల దేవాలయ భూములను ఆక్రమించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమించుకొని అనుభవిస్తున్నారు. సర్వే నెం. 173/ 7,8,9,16 లలో గ్రామం లో 4 గురు పేద వ్యక్తులు కు పట్టాలు ఇచ్చిన స్కెచ్ లో లేకుండా చేసేశారు. సర్వే నెం. 173/ 3,4 అమ్మవారు గుడి కుడి వైపున ఎదురుగా గెడ్డ వరకు 3 1/2 ఎకరాలు భూమిని కబ్జాదారులు 2023 లో సిమెంట్ స్తంభాలు తో ఫెనిషింగ్ వేసి సర్వే నెం. 258,173 చూపించి అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ ఫెనిషింగ్ 2023 లో గ్రామస్తులంతా ఏకమై తొలగించగా అక్రమణదారులే బరితెగించి గ్రామంలో 18 మంది పై అక్రమ కేసులు పెట్టారని గ్రామస్తులు వాపోతున్నారు. కేసు పెండింగ్ లో ఉండగా మళ్ళీ ఫెనిషింగ్ వేసి మొక్కలు నాటుతున్నారని తెలిపారు. అమ్మవారు గుడి వెనకాల చెరువులో అనుమతులు లేకుండా స్థానిక సర్పంచ్ కూడా చెప్పకుండా చెక్ డాం నిర్మాణం చేపట్టడం, నెలరోజులు క్రితం అమ్మవారి చెరువులు లో అనుమతులు లేకుండా ఆక్రమణ దారులు ఇష్టానసారంగా ఆకీసు, సరుగుడు, యూకలిప్ట్ చెట్లు అక్రమంగా నరికేసి దండిగా సొమ్ము చేసుకుంటున్నారని గ్రామంలో వారి అక్రమాలు, అన్యాయాలను అడిగితే ఎదురుతిరిగి అక్రమ కేసులు పెట్టి భయాందోళనలు కలిగిస్తున్నారని స్థానిక మహిళలు కన్నీటి పర్యంతం అయ్యారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశం లో గిరిజనులు కంటే హీనంగా నూతన అనకాపల్లి జిల్లా లో చిన భీమవరం గ్రామస్తులను రంగస్థలం సినిమా కథ తరహాలో ఈ డిజిటల్ యుగం లో మమ్మల్ని చూస్తున్నారని స్థానిక గ్రామమంతా రోదిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు మాకు న్యాయం చేయడం లేదని అండ బలం, అర్థ బలం చూసుకొని భూ బకాసురులు ఇష్టరాజ్యం గా బరి తెగించి వందల ఎకరాలు కబ్జాలు కు పాల్పడుతున్న అక్రమణ దారులకే అధికారులు, ప్రజాప్రతినిధులు కొమ్ము కాస్తున్నారని గ్రామస్థులైన పెద్దలు, యువకులు, మహిళలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అనకాపల్లి జిల్లా కలెక్టర్ స్పందించి కబ్జాలు కు గురైన వందల ఎకరాల పడమటమ్మ అమ్మవారి భూములు ను జేసీ, ఆర్ డి ఓ, స్థానిక తహసీల్దార్ల తో ఎంక్వయిరీ వేసి అమ్మవారి భూములను అమ్మవారికి అప్పగించి, గ్రామంలో పేదలైన వారికి పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

మాడుగుల ఉప సర్పంచ్‌గా వరహాలు బాధ్యతలు స్వీకారం

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల ఉపసర్పంచ్‌గా జవ్వాది వరహాలు సోమవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాననన్నారు. అనంతరం సర్పంచ్ యడ్ల కళావతి ఆధ్వర్యంలో ఎంపీపీ తాళపురెడ్డి వెంకట రాజారాం, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ ఉప సర్పంచ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.మూర్తిబాబు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజల కోసమైతే అనుమతులు తీసుకుని గ్రావెల్ తవ్వుకోండి : సీపీఎం

-పంచదార్ల కొండపై అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు ఆపాలి
-ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చి, అభివృద్ధి చేస్తే కాదనం

విశాలాంధ్ర - రాంబిల్లి : మండలంలో పంచదార్ల గ్రామ రెవెన్యూ పరిధిలో గల ఉమా ధర్మ లింగేశ్వర స్వామి కొలువై ఉన్న ఈ కొండపై గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు యదేచ్ఛగా జరుగుతున్నాయంటూ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, మండల కార్యదర్శి జి దేముడు నాయుడు, చందక రామకృష్ణలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ కొండపై గ్రావెల్ తవ్వకాలపై, కొంతమంది విజిలెన్స్ అధికారులకు, ఫిర్యాదు చేసి, గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టును కూడా ఆశ్రయించారని, ఈ కొండపై ఎటువంటి గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్ట రాదని ,అపరాధ రుసం కూడా విధించడం జరిగిందన్నారు.ఈ మధ్య కాలంలో యథేచ్ఛగా అర్ధరాత్రి పూట అక్రమంగా జెసిబి లతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, లారీలతో తరలించడంతో కొంతమంది ఫిర్యాదు చేయగా, జిల్లా విజిలెన్స్ మైనింగ్ అధికారులు రాత్రిపూట వచ్చి,కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నటువంటి వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసినదే, అక్రమంగా గ్రావెల్ తవకాలు చేయడం వలన, ఒకపక్క పేద రైతులు నష్టపోతున్నారని, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. అయితే

ఇటీవల కాలంలో కొత్తగా కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ కూడా ప్రారంభించారు. అలాంటి పుణ్య క్షేత్రం కొండపై ఇలా అక్రమంగా గ్రావెల్ తరలించడమేమిటని అని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. వాస్తవంగా ప్రభుత్వ అవసరాల కోసమైతే , మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకొని, ఇటు రైతులకు గాని, ప్రజలకు గాని ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూర్చి, అభివృద్ధి చేస్తే ఎవరూ కాదనరన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత అధికారులు, పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రజలకు న్యాయం చేస్తూ,ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు తీసుకుని,గ్రావెల్ త్రవ్వకాలు చేపట్టుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామాల్లో 1 బి ఇప్పించండి

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో రీ సర్వే గ్రామాల్లో ఎల్‌పిఎం లింక్ ఉండ డంతో వన్ బీలు రావడం లేదని, దీంతో బ్యాం కుల్లో రైతుల లోన్ల మార్జిన్ కోసం నానా అవస్థలు పడాల్సి వస్తుందని సోమవారం గ్రీవెన్స్ లో మండల రెవెన్యూ తహసీల్దార్ అజూరఫీ జాన్ కి ఫిర్యాదు చేశారు. సచివాలయాల్లో 50 రూ పా యలు చలానా కట్టి, దరఖాస్తు చేసుకు న్నట్ల యితే వన్ బి లిప్పిస్తామని తహ సిల్దార్ తెలిపారు.

లెపర్సీ మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : విజయనగరం చెల్లూరు సమీపంలో ఉన్న ది లెప్రసీ మిషన్ హాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమ వారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీ యూపీ పాఠశాలలో ఆరోగ్యకరమైన ప్రారంభాలు ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రతినిధి టి దీప్తి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం చేయాలని దీనివల్ల మెదడుకు ప్రశాంతత ఉంటుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే ఒత్తిడి తగ్గించుకునేందుకు ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులు మంచి అలవాటులను నేర్చుకోవాలని చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వై రాము, ప్రాజెక్ట్ సిబ్బంది ఎం వంశీ పాల్గొన్నారు

ప్రభుత్వ న్యాయవాదిగా ఆర్.సూర్యనారాయణ

విశాలాంధ్ర - కంటోన్మెంట్ విజయ నగరం : జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా ఆర్.సూర్య నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ జిపిగా పని చేసిన శ్రీనివాసరావు పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో సూర్యనారాయణ నియమితులయ్యారు. ఆయన ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం, జిపిగా బాధ్యతలను స్వీకరించారు. ఆయన జీపీగా మూడు సంవత్సరాల పాటు సేవలు అందించనున్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.యస్. జీవన రాణి ఆధ్వర్యములో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముం దుగా ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యకరమైన అలవాట్లు అలవారుచుకొని పాటించాలని వారి యొక్క భవిష్య త్తును ఆరోగ్యకరంగా తీర్చిదదుకోవాలన్నారు .దానికి రోజువారీ వ్యాయమం, వాకింగ్, ధ్యానం తో పాటు సమతుల ఆహారం, తగినంత నీరు తీసుకుంటూ అనారోగ్యకరమైన అలవాట్లను మానుకోవాలన్నారు క్రమం తప్పకుండ ఆరోగ్య పరిక్షలు చేఇంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యం మన చేతుల్లోవుంటుందని తెలియజేసారు. మాత శిశు సేవలపైన అవగాహనకల్పించారు. బడిలో బిడ్డ- ఒడిలో బిడ్డ పరిసరాల పరిశుభ్రత-ఆరోగ్యానికి భద్రత అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

పశు నీటి తొట్ల నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

విశాలాంధ్ర - చోడవరం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా దుడ్డుపాలెం లో పశువుల త్రాగునీటి తోట్ల నిర్మాణ కార్యక్రమం సోమవారం ఎమ్మెల్యే కె. ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రారంభించారు. రూ. 31,000 లు వ్యయం తో మండలానికి 9 నీ టి తొట్లు అవసరమని ప్రతిపాదించినట్లు ఎన్. ఆర్.ఈ.జి.ఎస్. అధికారులు తెలిపారు. గ్రామాల్లో నీ టి సదుపాయం వున్న గ్రామ కంఠ స్థలాల్లో రహదారుల్లో నిర్మిస్తారని, పాడి రైతులు వినియోగించవలసిందిగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో చోడవరం మండల ఎంపిడిఓ పి. ఆంజనేయులు, రాష్ట్ర గవర కార్పోరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాదర్, మాజీ జెడ్పీటీసీ మచిరాజు,, దుడ్డుపాలెం సర్పంచి గారు, మిగిలిన పెద్దల అందరూ పాల్గొనడం జరిగింది.

200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం : గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా 200 రోజులు పని కల్పించి రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తిమ్మరాజు పేటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిశారు కలిసి పోరాడి ఉపాధి పనులు సాధించుకున్న కూలీలను అభినందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు మాట్లాడుతూ కలిసి పోరాడి ఉపాధి పనులు సాధించుకున్న కూలీలను అభినందించారు. మండుతున్న ఎండల్లో పని చేస్తున్న కూలీలకు టెంట్లు, నీళ్ల వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి 15 రోజులకి కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరగడం రామనాయుడు, నడుపురు సన్యాసిరావు, సెల్లుపోయిన అప్పారావు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా మౌలిక వసతులు : మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - విజయనగరం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ పథకం క్రింద వేతనదారులకు పని కల్పించడం ద్వారా వలసను నివారించడమే కాకుండా, కన్వర్జెన్సీ నిధులతో సిసిరోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు, రైతులకు ఉపయోగపడేలా చెరువుల అభివృద్ధి, ఫారమ్ ఫాండ్స్, గోకులాల నిర్మాణం, నర్సరీల పెంపకం తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధిహామీ పథకాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకొని ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై స్థానిక డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి వేతనదారులకు పని కల్పన, వంద రోజుల పనిదినాలు, సగటు వేతనం పెంపు, ఫారమ్‌పాండ్స్, ఇంకుడు గుంతలు, గోకులాలు, ఉద్యాన సాగు, పట్టుసాగు, పశుగ్రాసం పెంపకం, నర్సరీలు, కన్వర్జెన్సీ పనులు తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు, జీవన ప్రమాణాలను పెంచేందుకు ఈ పథకం గొప్ప అవకాశమని, దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్వామా, డిఆర్డిఏ శాఖలు రెండూ అత్యంత ప్రాధాన్యమైనవని, అభివృద్దిలో వీటి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ ఏడాది కన్వర్జెన్సీ నిధులను శతశాతం వినియోగించుకొనేందుకు జిల్లా స్థాయిలోనే కాకుండా, మండల స్థాయిలో కూడా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ప్రతీ గ్రామానికి ఒక చెరువును ఎంపిక చేసి, స్లూయిస్‌లు తదితర పనులను నిర్వహించడం ద్వారా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ పనులను జూన్ నుంచి మొదలు పెట్టాలని ఆదేశించారు. పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశు గ్రాసం పెంపు విస్తీర్ణం పెంచాలని, అలాగే వ్యక్తికి గరిష్టంగా 50 సెంట్ల నిబంధనను సవరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలానికి ఐదు బయో గ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఉపాధిహామీ పథకం క్రింద కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో పంచాయితీ కార్యదర్శులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. పశువులు ఉన్నవారికే గోశాలలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఉన్నతి పథకం క్రింద ఉపాధిహామీ వేతన దారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమల్లో జిల్లా ఇప్పటికే రెండు సార్లు జాతీయ అవార్డు గెలుచుకుందని, ఈ ఏడాది పథకాన్ని శతశాతం వినియోగించుకోవడం ద్వారా మూడోసారి అవార్డును సాధించేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమీక్షా సమావేశంలో డ్వామా పిడి ఎస్.శారదాదేవి, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, పంచాయితీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, తోటపల్లి ఎస్ఈ స్వర్ణకుమార్, పశు సంవర్థశాఖ డిడి డాక్టర్ ఎన్.రామారావు, డిఎఫ్ఓ కొండలరావు, వ్యవసాయశాఖ ఎడిఅన్నపూర్ణ, డ్వామా ఎపిడిలు, ఏపిఓలు, ఈసిలు, పిఆర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మరింత మెరుగు పర్చాల్సి ఉంది
నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం : నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కలకు శస్త్ర చికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు శతశాతం జరిపించాల్సిందేనని చెప్పారు. సచివాలయాల పరిధిలో సంచరిస్తున్న కుక్కల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర నేపథ్యంలో ఈ వేస్ట్ సేకరణ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. హెూం కంపోస్ట్ విధానం పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వల వద్ద యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియలను చేపట్టాలన్నారు. డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లను కచ్చితంగా వసూలు చేయాలని ఆదేశించారు.మరింతగా కృషి చేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీ లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఈఓకి శుభాకాంక్షలు తెలిపిన ఏపీటీఎఫ్

విశాలాంధ్ర -యస్.రాయవరం : జిల్లా ఉప విద్యాశాఖగారి పెన్నాడ అప్పారావు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్డురోడ్డులో ఆయన నివాసంకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు ఆధ్వర్యంలో వెళ్లిన బృందం పుట్టినరోజు శుభాకాంక్షలు తో పాటు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలియజేశారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సునీల్, గోవిందరావు, అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

బాలికను వేధించిన యువకుడు అరెస్టు

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి పంచాయితీ జంగాల కాలనీకి చెందిన పిల్లి బోయిన బ్యూలా (15) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉక్కుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అదే ప్రాంతానికి చెందిన పెయింటర్ గా పనిచేస్తున్న ఒక యువకుడు తనను ప్రేమిస్తున్నానని తరచూ వేధించడంతో ఆ బాలిక తీవ్రమన స్థాపం చెంది ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తండ్రి వరహాల రావు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,నిందితుడు ఆచూకీ కోసం పోలీసులు రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టగా, సోమవారం ముద్దాయి ఒమ్మి జయకృష్ణ అలియాస్ నాని ను ఎస్సై పి. మనోజ్ కుమార్,అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

బైక్ దొంగలు అరెస్టు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండల పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానిక ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బైక్ దొంగల్ని పట్టుకున్నారు. విజయ రామరాజుపేట సమీపంలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తుల్ని అదుపులో అదుపులోనికి తీసుకొని విచారించగా విజయరామరాజుపేట గ్రామానికి చెందిన ఈ ముగ్గురు వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో 9 బైకులు దొంగతనం చేసినట్టుగా పోలీసులు ఎదుట ఒప్పుకున్నారు.దీంతో బుచ్చయ్యపేట పోలీసులు లోతైన విచారణ జరిపి 9 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బైకు దొంగతనాలకు పాల్పడిన వేగి వెంకటేశు, పెంటకోట చిరంజీవి, భీమరశెట్టి నాని లను అరెస్ట్ చేసామని అనకాపల్లి డి ఎస్ పి శ్రావణి మీడియాకు సమాచారం అందించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : గత నెలలో మండలంలోని వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన మైనర్ బాలికను బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలిక ఆచూకీ కనిపెట్టి బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన పై గత నెలలోనే కేసు రిజిస్టర్ చేసినట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండల వ్యాప్తంగా నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వ హిస్తున్నట్లు ఎంపీడీవో వి విజయలక్ష్మి తెలిపారు మొబైల్ ఆధార్ క్యాంపు షెడ్యూల్ వివరాలు పెద్ద మదిన సెక్రటేరియట్ పరిధిలో 8న చింతపాక, 9వ తేదీ గున్నెంపూడి,పదవ తేదీ కెపి అగ్రహారం,11వ తేదీ పెద్ద మదిన, లోపూడి సెక్రటేరియట్ పరిధిలో 8వ తేదీన వడ్డాది 1, 9వ తేదీన వడ్డాది2, పదవ తేదీన విజయ రామరాజుపేట 11వ తేదీ మంగళాపురం, ఆర్ శివరాంపురం సెక్రటేరియట్ పరిధిలో 8 వ తేదీన రాజాం 9వ తేదీన తురకలపూడి పదవ తేదీన మల్లం 11వ తేదీ ఆర్ శివరాంపురం, తైపురం సెక్రటేరియట్ పరిధిలో 8 బుచ్చయ్యపేట 9 కందిపూడి 10 పెదపూడి 11 పి. పి అగ్రహారం గ్రామాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఒంటిపూట బడులు ప్రైవేటు పాఠశాలలకు వర్తించవా... ?
పట్టించుకోని విద్యాశాఖాధికారులు

విశాలాంధ్ర - అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు రోజంతా పనిచేస్తున్నాయి. ఒంటిపూట బడులు ప్రభుత్వ పాఠశాలలకేనా, ప్రైవేట్ పాఠశాలలకు వర్తించవా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎండలు తీవ్రత దృష్ట్యా మార్చి 15 నుంచి ఉదయం 7:45 నుండి మధ్యాహ్నం 12:30 గంటలలోపు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ మండలంలో ఒంటిపూట బడులు అమలకు నోచుకోక, కొన్ని ప్రైవేటు పాఠశాలలు రోజంతా పనిచేస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒంటిపూట బడులు నిర్వహణకు చర్యలు చేపట్టి ఎండ తీవ్రత నుండి పిల్లలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదీ శిక్ష... రూ. లక్ష జరిమానా

విశాలాంధ్ర - కశింకోట : హత్య కేసులో ఒక నిందితునికి జీవిత ఖైదు శిక్ష రూ.లక్ష జరిమానా విధిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం తెలిపారు. 2018 జూన్ 8న తమిళ నాడు రాష్ట్రం మధురైకి చెందిన నిందితుడు శర్వణ్ కుమార్ గణపతి, తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా ఆచూరే పోస్ట్ కు చెందిన మృతుడు కన్నన్ మునిరాజ్ ఇద్దరూ కంటైనర్ లారీలో కశింకోట జాతీయ రహదారి సమీపంలో ఉన్న కాశీప్రసాద్ పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ భోజనం అనంతరం మధ్యాహ్నం 2 గం టల సమయంలో మునిరాజు, శర్వన్ కుమార్ కు కితకితలు పెట్టగా శర్వణ్ కుమార్ కింద పడిపోయాడు. ఈ సంఘటనపై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం ముని రాజు పెట్రోలు బంకు సమీపంలో గుట్టపై విశ్రమిస్తుండగా ఆవేశంతో శర్వన్ కుమార్ మునిరాజుపై కాంక్రీట్ రాయితో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రరక్త స్రావంతో ఉన్న మునిరాజును స్థానికులు గమనించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీ హెచ్ కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ 9న మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనపై ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన మల్లెపు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ జి. రామచంద్రరావు కేసు నమోదు చేసి అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. ఆ కేసుకు సంబంధించి జిల్లా జడ్జి కోర్టులో వాదనలు అనంతరం న్యాయ మూర్తి శ్రీవిద్య తుది తీర్పు ఇచ్చారన్నారు. ఈ కేసులో విచారణలో భాగమైన అప్పటి అనకాపల్లి రూరల్ సీఐ జి. రామచంద్రరావును, వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాసరావును, పోలీసు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు బాకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలం లోని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు 3 నుండి 13 నెలలు జీతాలు అందక ఆకలితో అలమటిస్తున్నామని ఎంపీడీవో ఆఫీస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కాళీ ప్లేట్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మండలంలో ని 32 పంచాయతీ లనుండి కార్మికులు హాజరై జీత బకాయిలు వెంటనే చెల్లించాలని పెద్ద పెట్టున నినదించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కోశాధికారి వి. వి. శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్. వి. నాయుడు లు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు చేస్తున్న కార్మికులకు 2 నుండి 13 నెలలు జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని బ్రతకాలని నిలదీశారు. అరకొర జీతాలతో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం సకాలంలో జీతాలు కూడా ఇవ్వక పోవడం దుర్మార్గం అన్నారు. విజయరామరాజు పేట 3 నెలలు, తురకల పూడి 13 నెలలు , బుచ్చయ్య పేట 6 నెలలు, రాజాం 13 నెలలు, బంగారు మెట్ట 4 నెలలు ఇలా అన్ని పంచాయతీ ల్లో 3 నుండి 13 నెలలు బకాయిలు ఉన్నాయన్నారు. ఈశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గారు వెంటనే స్పందించి అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. పంచాయతీ ల్లో టెండర్ విధానం రద్దు చేసి జి. ఓ. ప్రకారం 10 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, ఈ ఎస్ ఐ, పి. ఎఫ్. యూనిఫామ్, ప్రమాద బీమా, నూనె, మాస్కులు, గ్లవుజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాంబశివరావు, కార్మికులు ఒలమేరక ఏసు, బెల్లంకి నూకరాజు, బొర్రా అమ్మాజీ, ఈతలపాక శ్రీను, మరియమ్మ, ఎలుసూరి కొండబాబు, జి. ప్రసాద్, రాజు తదితరులు పాల్గొని.అనంతరం ఎంపీడీవో కు వినతిపత్రం అందజేశారు.

శ్రీరాంపురంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని రామాలయంలో సీతారాముల కళ్యాణ వేడుకలు ఈఏడాదన్నా అంగరంగ వైభవంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అన్ని చోట్ల శ్రీరామనవమి రోజున సీతారాముల కళ్యాణం జరుగుతుండగా, ఒక్క పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని రామాలయంలో మాత్రం నవమి వెళ్లిన మూడవ రోజు ఏకాదశి రోజున సీతారాముల కళ్యాణం నిర్వహిస్తారు. అయితే గ్రామంలో రామాలయానికి సుమారు 16ఎకరాలు భూములు దేముడి మాన్యం ఉన్నప్పటికి ఆలయం మాత్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. భూముల మీద వచ్చిన ఆదాయం ఏమౌతుందని, కనీసం ఆలయానికి రంగులు వేయడం లేదని, సోమవారం జరిగిన సీతారామస్వాముల ఊరేగింపు కూడా పట్టుమని పదిమందికి కూడా సమాచారం ఇవ్వకుండా నిర్వహించారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకొని ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోని తీసుకొని, భూములను స్వాధీనం చేసుకొని, ప్రతీ ఏటా సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తలకు కాకుండా ప్రతిపక్ష నాయకులకు లబ్ధి చేకూర్చడం దేనికి?
టీడీపీ నాయకులు సూరెడ్డి ఎర్రినాయుడు

విశాలాంధ్ర - గొలుగొండ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా జండా మోసి ఎంతో కష్టపడ్డామని, ఇప్పుడు కూటమి అధికారంలో ఉండగా ప్రతిపక్ష నాయకులకు లబ్ధి చేకూర్చడం ఎంతవరకు సబబు అని తెదేపా పార్టీ నాయకులు సూరెడ్డి ఎర్రినాయుడు ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం మల్లంపేటలో ఒక వీడియో రిలీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ 2014- 19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మా గ్రామంలో ప్రతిపక్ష నాయకులకు సుమారు 50 లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరేందుకు, మండల నాయకులు సహకరించారా లేదా నియోజకవర్గ నాయకులు సహకరించారా అన్న విషయం తెలియాలన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా సుమారు 17 లక్షల రూపాయల వరకు అదే వ్యక్తి లబ్ధి పొందుతున్నట్లు మా సీనియర్ నాయకులు తెలిపారని. మరి మేము పార్టీ కోసం కష్టపడుతున్నాము, మేము ఎందుకు కనపడలేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా విషయాలు పై కార్యకర్తలకు వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- ఇద్దరు మహిళలు మృతి, 9 మందికి గాయాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : జాతీయ రహదారిపై పట్టణంలోని వైజంక్షన్ - పోలీస్‌స్టేషన్ మధ్యలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మ్యాక్సి క్యాబ్ ట్రిప్పర్ లారీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో 9మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీవిఎంసికి చెందిన పారిశుధ్య కార్మికులు శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో పారిశుద్య సేవలు అందించి తిరిగి మ్యాక్సీ క్యాబ్‌లో వస్తుండగా పాయకరావుపేట వైజంక్షన్ - పోలీస్‌స్టేషన్ మధ్యలో ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేసి దాని కంటే ముందు వెళ్తున్న ట్రిప్పర్ లారీని ఢీకొట్టారు. ఈప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈప్రమాదంలో మరో 9మంది తీవ్ర గాయాలపాలయ్యారు. మృతి చెందిన వారిలో జోగా పైడితల్లి (65), గుర్రాల సత్య (40) ఉన్నారు. అలాగే చింతకాయల ముత్యాలరావు, ఎం.కనకమహాలక్ష్మి, అర్జి ప్రవల్లిక, డి.వెంకటలక్ష్మి, ఐ.వెన్నెల, డి.విజయ, జె.సాయిదుర్గ, జె.ధనలక్ష్మి, దుంప లిజ గాయపడిన వారిలో ఉన్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి, గాయ పడిన వారిని చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు.

ఘనంగా ముగిసిన లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆదివారం నవమి సందర్భంగా మహా త్రిపుర సుందరి సహిత లలితా సహస్ర నామావళి హవనం మరియు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుండి నవవర్ణ శోభిత పుష్పాలతో లలితాంబిక అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం లలితా పరాభట్టరికా మహా త్రిపుర సుందరీ హవనం, విశేష పుష్పాలంకరణ త్రిశతి సహిత కుంకుమార్చన, సాయంత్రము ఉత్సవ మూర్తు లైన లలితాంబికా సదాశివులను రథారోహణ గావించి అష్ట దిక్పాలకులకు ద్వారా పూజ గావిస్తూ ఊరేగింపుగా రథా యాత్ర కన్నుల పండువగా జరిగింది.గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ భక్తులందరికీ ఆశీర్వచనం అందించారు. దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, శ్రీ విద్యా ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.